ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్త విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ.26.07.2025 సమయం.13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. దేశవ్యాప్తంగా ఈరోజు 26వ కార్గిల్ విజయ్ దివస్‌ను జరుపుకుంటున్నారు. రాష్ట్రంలో కూడా అన్ని జిల్లాల్లో విజయ్ దివస్ నిర్వహిస్తున్నారు.

2. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్యశ్రీ వైద్య సేవలు 10 లక్షల మైలురాయిని అధిగమించిందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు.

3. జాతీయ మానవ హక్కుల కమిషన్- NHRC ఈ నెల 28, 29 తేదిల్లో హైదరాబాద్ లో బహిరంగ విచారణ నిర్వహిస్తుంది.

4. రాష్ట్రంలో పలు జిల్లాల్లో మూడో రోజు కూడా వర్షాలు కురుస్తున్నాయి. ఈరోజు, రేపు ఓ మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరమ కేంద్రం తెలిపంది.

---------------------------

**KARGIL VIJAY DIWAS**

1999 కార్గిల్ యుద్ధంలో ప్రాణ త్యాగం చేసిన సైనిక అమర వీరులకు నివాళులర్పించేందుకు ఈరోజు దేశవ్యాప్తంగా కార్గిల్ విజయ్ దివస్‌ను జరుపుకుంటున్నారు. ఆనాడు పాకిస్తాన్‌పై మన దేశం సాధించిన విజయానికి గుర్తుగా ఈరోజు 26వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్నారు. ఈ ఆపరేషన్ సమయంలో, భారత సాయుధ దళాలు జమ్మూ కాశ్మీర్‌లోని కార్గిల్ జిల్లాలో పాకిస్తాన్ సైనికులు, ఉగ్రవాదులు చొరబడిన భూభాగాలను తిరిగి స్వాధీనం చేసుకున్నాయి. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి

నరేంద్రమోది, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తదితరులు అమర జవాన్లకు నివాళులర్పించారు. సైనికుల త్యాగం, వారు ప్రదర్శించిన శౌర్యం దేశ ప్రజలకు స్ఫూర్తి దాయకమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సామాజిక మాధ్యమ పోస్టులో పేర్కొన్నారు.

**NSD**

---------------------

**కార్గిల్ విజయ దివస్**

కార్గిల్ విజయ దివస్ సందర్భంగా కార్గిల్ యుద్ధ స్మారక చిహ్నం వద్ద సైనిక దళాల ప్రధాన అధికారి జనరల్ ఉపేంద్ర ద్వివేది నివాళి అర్పించారు. 1999లో జరిగిన కార్గిల్ యుద్ధంలో పాకిస్తాన్ పై పోరాటంలో ప్రాణాలు ఇచ్చిన అమరవీరులను ఆయన భావోద్వేగంతో గుర్తుచేసుకున్నారు.

**NSD**

---------------------

**విజయ్ దివస్**

రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో విజయ్ దివాస్ ను ఘనంగా నిర్వహిస్తున్నారు. కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా హైదరాబాద్ లోని, షాపూర్ నగర్ లో నిర్వహించిన 5కె రన్ లో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు పాల్గొన్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా కార్గిల్ దివాస్ ను జరుపుకుంటున్నారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా, సిరిసిల్ల, వేములవాడతో పాటు జిల్లాలోని మండలాలు, పలు గ్రామాలలో బిజెపి, విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అమర సైనికులకు నివాళులర్పించారు.

**డెస్క్/పీటీసీ-రాజన్న సిరిసిల్ల**

--------------------------

**ఆరోగ్యశ్రీ పథకం - సంగారెడ్డి**

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్యశ్రీ వైద్య సేవలు 10 లక్షల మైలురాయిని అధిగమించిందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకూ 10 లక్షల 70 వేల మందికి ఆరోగ్యశ్రీ పథకం

ద్వారా వైద్య సేవలు పొందారని 20 నెలల్లో హాస్పిటళ్లకు 1590 కోట్ల రూపాయలకు పైగా ప్రభుత్వం చెల్లించిందని  మంత్రి దామోదర రాజనర్సింహ చెప్పారు. ఆరోగ్యశ్రీ పథకంలో ఉచిత వైద్యం పరిమితిని 5 లక్షల రూపయల నుంచి 10 లక్షల రూపయాలకు పెంచిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వందేనని మంత్రి పేర్కొన్నారు. కొత్తగా ఆరోగ్యశ్రీలో 108 హాస్పిటల్స్ చేర్చగా, మొత్తంగా 461 ప్రైవేటు-కార్పొరేట్ హాస్పిటళ్లలో ఆరోగ్యశ్రీ సేవలు అందుతున్నాయని మంత్రి తెలిపారు.

**SANGAREDDY PTC**

--------------------

**రోడ్డు ప్రమాదం - యాదాద్రి**

యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ మండలం, బైతాపురం వద్ద ఈ ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు పోలీస్ అధికారులు మరణించారు. ఆంధ్రప్రదేశ్ ఇంటెలిజెన్స్ అండ్ సెక్యూరిటీ వింగ్‌లో పని చేస్తున్న డీఎస్పీలు చక్రధర్ రావు, శాంతరావు లు ప్రయాణిస్తున్న స్కార్పియో వాహనం అదుపుతప్పి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చక్రధర్ రావు, శాంతరావు అక్కడికక్కడే మృతి చెందగా, అదే వాహనంలో ఉన్న ప్రసాద్, డ్రైవర్ నర్సింగరావు కు తీవ్ర గాయాలయ్యాయి.

**పీటీసీ, యాదాద్రి భువనగిరి**

--------------------

**NHRC**

జాతీయ మానవ హక్కుల కమిషన్- NHRC ఈ నెల 28, 29 తేదిల్లో  హైదరాబాద్ లో బహిరంగ విచారణ నిర్వహిస్తుంది. మానవ హక్కుల ఉల్లంఘనలకు సంబంధించిన 109 కేసులను ఈ సందర్భంగా విచారించనున్నారు. జూబ్లీహిల్స్ లో మర్రి చెన్నారెడ్డి మానవ

వనరుల అభివృద్ధి కేంద్రంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో NHRC చైర్మన్ జస్టిస్ వి. రామ సుబ్రహ్మణియన్, కమిషన్ సభ్యులు జస్టిస్  బిద్యుత్ రంజన్ సారంగి, విజయ భారతి సయని, జాతీయ మానవ హక్కుల కమీషన్ ప్రధాన కార్యదర్శి భరత్ లాల్ సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొంటారు. 29వ తేదిన పలు మానవ హక్కుల కేసులు, అవగాహనకు సంబంధించిన కేసుల విషయంలో రాష్ట్ర ఉన్నతాధికారులతో సమావేశం అవుతుంది.

**SDP**

--------------------

**కామారెడ్డి**

రాష్ట్ర ఉద్యాన శాఖ అందిస్తున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కామారెడ్డి జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి జ్యోతి కోరారు. కామారెడ్డిలో వానాకాలం, యాసంగి 2 సీజన్లలో కలిపి ఏడాదికి 550 ఎకరాల్లో కూరగాయలు సాగు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. కూరగాయల నారు, ఉల్లి సాగుతో పాటు మల్చింగ్, పందిరి సాగుపైన కూడా ప్రభుత్వం రాయితీలను అందిస్తుందని, రైతులు ఒక నెల ముందుగానే దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 89777 14030 నెంబర్ సంప్రదించాలని సూచించారు.

**పిటిసి, కామారెడ్డి**

----------------------

**MANN KI BAAT**

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని ఆలోచనలను దేశ, విదేశాల ప్రజలతో పంచుకునే మన్ కీ బాత్ ప్రసంగం రేపు ఉదయం 11 గంటలకు ఆకాశవాణిలో ప్రసారం అవుతుంది. ఇది ప్రతినెలా ప్రసారమయ్యే రేడియో కార్యక్రమంలో 124వ సంచిక. కాగా, ఈ కార్యక్రమం ఆకాశవాణి, దూరదర్శన్ మొత్తం నెట్వర్క్, AIR న్యూస్ వెబ్సైట్, కేంద్ర సమాచార, ప్రసార శాఖ YouTube ఛానెళ్లలో కూడా ప్రత్యక్ష ప్రసారం అవుతుంది. హిందీ ప్రసంగం ముగిసిన వెంటనే తెలుగు అనువాదం ప్రసారం అవుతుంది.

**NSD**

-------------------

**మంచిర్యాల జిల్లా**

వసతి గృహాల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు, నాణ్యమైన భోజనం అందించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఈ ఉదయం సాయికుంటలో గల గిరిజన సంక్షేమ వసతిగృహం షెడ్యూల్డ్ కులాల సంక్షేమ వసతి గృహాలను జిల్లా కలెక్టర్ సందర్శించి ఆకాశవాణి ప్రతినిధి శ్రీనివాస్ తో మాట్లాడారు...

**సౌండ్ బైట్...కలెక్టర్ కుమార్ దీపక్**

**పీటీసీ- మంచిర్యాల**

------------------------

**వర్షాలు జిల్లాలు**

కొమరమ్ భీం ఆసిఫాబాద్ జిల్లాలో గత మూడు రోజులుగా కురుస్తున్నాయి. ఏజెన్సీ మండలాల్లో వాగులు పొంగి ప్రవహిస్తూ ఉండడంతో పదుల సంఖ్యలో గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్ళకూడదని గ్రామాల్లో అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

ఖమ్మం జిల్లాలో ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో జిల్లాలోని పాలేరు రిజర్వాయర్, వైరా రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకున్నాయి. వర్షాల కారణంగా సత్తుపల్లి ఓపెన్ కాస్ట్ లో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది.

ఎగువన కురుస్తున్న వర్షాలతో గోదావరిలో క్రమంగా నీటి మట్టం పెరుగుతోంది. ఈ ఉధయం 11 గంటలకు భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 34.4 అడుగులకు చేరిందని అధికారులు చెప్పారు. దుమ్ముగూడెం మండలం పర్ణశాల వద్ద పర్యాటక ప్రదేశం నారచీరల ప్రాంతం వరద నీటిలో మునిగిపోవడంతో పర్యాటకులను ఆపేశారు.

యాదాద్రి భువనగిరి జిల్లాలోని రాజాపేటలో 20 మి.మీ, చౌటుప్పల్ లో 13 మి.మీ, ఆలేరులో 12 మి.మీ వర్షపాతం నమోదైంది. రానున్న రెండు రోజుల పాటు జిల్లాలో వర్షాలు కొనసాగే అవకాశం ఉన్నందున, రైతులు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు సూచించారు.

మంచిర్యాల జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి జలాశయంలోకి భారీగా వరద వచ్చి చేరుతోంది. జలాశయం పూర్తిస్థాయి జలాశయం గరిష్ట నీటిమట్టం 148 మీటర్లు కాగా ప్రస్తుతం 143 మీటర్లకు చేరుకుంది.

జనగామ జిల్లాలోని జఫర్ గాడ్ మండలంలో నిన్న అత్యదికంగా 44 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా 24 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

**పీటీసీ-జనగామ, మంచిర్యాల, యాదాద్రి భువనగిరి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, కమురం భీం ఆసిఫాబాద్**

----------------------------

**సింగరేణి**

ఎడతెరిపి లేని వర్షాలతో నాలుగు రోజులుగా సింగరేణి ఓపెన్ కాస్టు గనుల్లో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. మంచిర్యాల జిల్లాల్లోని బెల్లంపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్ ఏరియాలోని 4 ఓపెన్ కాస్ట్ లలో బొగ్గు ఉత్పత్తి స్తంభించడంతో పెద్దయెత్తున సింగరేణి కి నష్టం వాటిల్లింది. శ్రీరాంపూర్ ఏరియాలోని ఐకే 1ఏ ఓసీపీ, ఎస్సార్పీ ఓసీపీ, మందమర్రి ఏరియాలోని కళ్యాణిఖని, బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీల్లో సుమారు లక్ష టన్నుల బొగ్గు ఉత్పత్తికి నష్టం జరిగింది.

**పిటిసి, మంచిర్యాల**

---------------------

**WEATHER UPDATE**

బంగాళాఖాతంలో వాయుగుండం తీరం దాటింది. రాష్ట్రంలో పలు చోట్ల ఈరోజు, రేపు ఓ మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ఆరెంజ్ అలర్ట్, నిజామాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి,

మెదక్ జిల్లాలకు యెల్లో హెచ్చరిక జారీ చేశారు. వర్షాకాలం ప్రారంభం నుంచి నెలన్నర పాటు తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనగా, ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 30.48 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైందని పేర్కొంది. ప్రస్తుతం ఈ సీజన్ లో 3 శాతం లోటు ఉండగా, నెలాఖరు కల్లా సాధారణ వర్షపాత గణాంకాలకు చేరుకుంటుందని చెప్పింది. కాగా, హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఈ రోజు ఉదయం నుంచి వర్షం కురుస్తోంది. పలు చోట్ల రోడ్లపై వర్షపు నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

**డెస్క్**

-----------------------

**సిద్దిపేట**

సిద్దిపేట జిల్లాలో భూభారతి రెవెన్యూ సదస్సుల ద్వారా స్వీకరించిన దరఖాస్తులను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించి డిస్పోజల్ చేయాలని కలెక్టర్ కె. హైమావతి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఆర్డీవోలు, తహశీల్దార్ లు, భూభారతి స్పెషల్ అధికారులతో కలెక్టర్ ఈరోజు సమావేశం నిర్వహించారు.

**పీటీసీ, సిద్దిపేట**

-------------------------

**దామోదర్ రాజనర్సింహ - నివాళులు**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, సిలారపు రాజనర్సింహ వర్ధంతి సందర్భంగా ఆయన తనయుడు, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సంగారెడ్డిలో నివాళులర్పించారు. రాజనర్సింహ అందోల్ నియోజక వర్గం నుండి 1967, 1972, 1978 శాసన సభ్యులుగా విజయం సాధించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రిగా అట్టడుగు వర్గాల అభ్యున్నతికీ పాటుపడ్డారని దామోదర్ రాజనర్సింహ గుర్తు చేసుకున్నారు.

**పిటిసి, సంగారెడ్డి**

-----------------------------------

**మహిళా కమిషన్**

భారతీయ న్యాయ సంహిత చట్టాలపై గృహ హింసకు సంబంధించిన డివి కౌన్సిలర్ లకు, సఖీ సిబ్బందికి అవగాహన కల్పించడానికి రాష్ట్ర మహిళా కమిషన్ ఈరోజు రాష్ట్ర స్థాయి అవగాహన సదస్సును నిర్వహిస్తుంది. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన ఈ సదస్సు, సాయంత్రం 4 గంటల వరకు హైదరాబాద్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తున్నారు. మహిళా కమిషన్ ఛైర్మన్ నేరెళ్ల శారద, అన్ని జిల్లాల డీవీ కౌన్సిలర్లు, సఖీ సిబ్బంది ఈ సదస్సులో పాల్గొన్నారు.

డెస్క్

-----------------------